

కొనసాగిన డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ నియామక పరీక్షలు (మెగా డిఎస్‌సి)-2025 మంగళవారం ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 180 మందికి 172 మంది హాజరయ్యారు. ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 200 మందికి 196 మంది హాజరవ్వగా, నలుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 140 మందికి 140 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకు జరిగిన పరీక్షలకు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 180 మందికి 180 మంది హాజరయ్యారు. సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మొత్తం 200 మందికి 193 మంది హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 139 మందికి 137 మంది హాజరవ్వగా ఇద్దరు గైర్హాజరయ్యారు.

రైతుకేదీ భరోసా..!



- రెండు జిల్లాల్లో రబీ ధాన్యం బకాయిలు రూ.186 కోట్లు
- వైరస్, ధరల పతనంతో ఆక్వా రైతులు విలవిల
- అయినకాడికి అమ్ముకున్న కోకో రైతులు
- మామిడి రైతుల పరిస్థితి మరింత దారుణం
- రైతులకు ఉచిత పంటల బీమా సైతం ఎత్తివేత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అన్నదాతకు భరోసా లేకుండాపోయింది. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్న' చందంగా రైతులు తీవ్ర నష్టాలు చవిచూసిన తర్వాత ప్రభుత్వం తూతూమంత్రపు చర్యలతో సరిపెడుతోంది. దీంతో ప్రభుత్వంపై రైతన్నల్లో తీవ్ర అసంతృప్తి పెల్లుబుకుతోంది. గడిచిన రబీలో రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. రబీలో సేకరించిన ధాన్యానికి తొలుత 48 గంటల్లోపే ధాన్యం సొమ్ము జమ చేసిన ప్రభుత్వం, ఆ తర్వాత చేతులెత్తేసింది. ఆఖరులో కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ము ఇప్పటికీ జమ కాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో మంగళవారం రూ.112 కోట్లు జమైనట్లు చెబుతున్నప్పటికీ ఇంకా రూ.150 కోట్లకుపైగా ధాన్యం బకాయి ఉంది. ఏలూరు జిల్లాలో రూ.36 కోట్లు మొత్తం రెండు జిల్లాల్లో రూ.186 కోట్లకుపైగా ధాన్యం సొమ్ము జమకాని పరిస్థితి ఉంది. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతులకు ధాన్యం సొమ్ము సకాలంలో అందకపోవడంతో తీవ్రంగా నలిగిపోతున్నారు. ధాన్యం సొమ్ము కోసం వేలాది మంది రైతులు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందనే చర్చ సాగుతోంది. జిల్లాలో మరో అతిపెద్ద సాగు ఆక్వా. రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. వాతావరణ మార్పులతో విబ్రో వైరస్ సోకి రొయ్యల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుత దశలో సాగు చేసిన రొయ్యల్లో 90 శాతానికిపైగా దెబ్బతిన్నట్లు ఆక్వా రైతులు ఘొల్లుమంటున్నారు. మేత, డీజిల్, పెట్రోల్ ధరలు వంటివి విపరీతంగా పెరిగినప్పటికీ వంద కౌంట్ ధర రూ.220 పలకడమే గగనంగా మారింది. దీంతో ఎంత శ్రమించినా ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదు.

అయినకాడికి అమ్ముకున్న కోకో రైతులు

ఈ ఏడాది జిల్లాలో కోకో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్రంలో అత్యధికంగా ఏలూరు జిల్లాలో దాదాపు 40 వేల ఎకరాల్లో కోకో రైతులు సాగు చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర కిలో రూ.800 ఉన్నప్పటికీ వ్యాపారులు మాత్రం కిలో రూ.400కు మించి కొనుగోలు చేయలేదు. దీనిపై కోకో రైతులు అలుపెరగని పోరాటం చేశారు. ప్రభుత్వం ఆలస్యంగా స్పందించడంతో రైతులకు మేలు జరగకుండాపోయింది. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోలేదు. కంపెనీలు కిలోకు రూ.450 ఇస్తే ప్రభుత్వం రూ.50 ఇచ్చి రూ.500కు కొనుగోలు చేస్తామని చెప్పి తప్పించుకుంది. ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.500 సైతం చాలామంది రైతులకు అందలేదు. ప్రభుత్వం ధర నిర్ణయించిన తర్వాత సైతం కిలో రూ.400కే కొనుగోలు చేశారంటే అతిశయోక్తి కాదు. జూన్ నెలాఖరుతో ప్రభుత్వం ప్రకటించిన ధర గడువు ముగిసింది. రైతులు మరో రెండు వారాలపాటు పొడిగించాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. జిల్లాలో 50 వేలకుపైగా ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ధర పడిపోయి టన్ను రూ.13 వేల నుంచి రూ.ఏడు వేల దిగువకు పడిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించింది. రైతుల వద్ద మూడొంతుల పంట అయినకాడికి అమ్ముకున్న తర్వాత చర్యల పేరుతో హడావుడి చేస్తున్నారనే ఆవేదన రైతుల్లో నెలకొంది.

ఉచిత బీమా ఎత్తివేత

రైతులకు మేలు చేసే పథకం ఉచిత పంటల బీమాను సైతం ప్రభుత్వం ఎత్తివేసింది. ఖరీఫ్‌లో ప్రతియేటా తుపాన్లు, వరదలు విరుచుకుడతాయి. దీంతో వరి రైతులు పంటను కోల్పోతున్నారు. వరి రైతులకు బీమా అత్యంత అవసరం. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వాలే చెల్లించేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసింది. దీంతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల నుంచి బీమా ప్రీమియంను బ్యాంకర్లు మినహాయించుకుంటున్నారు. రైతులకు ఇచ్చే ఉచిత బీమాను సైతం ఎత్తివేయడంపై తీవ్రంగా చర్చ సాగుతోంది.

బ్యాంకు పిఒ నుంచి... పోలీసు బాస్‌గా..!


- కేరళ డిజిపి రావాడ ఆజాద్ చంద్రశేఖర్ ఉద్యోగ ప్రస్థానం
- ఉమ్మడి రాష్ట్రంలోనే విద్యాభ్యాసం
- ఐపిఎస్‌గా తొలి పోస్టింగ్ కేరళలోనే



డిజిపిగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - వీరవాసరం

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన రావాడ ఆజాద్ చంద్రశేఖర్ అంచెలంచెలుగా ఎదిగి నేడు డిజిపి స్థాయికి ఎదిగారు. వీరవాసరానికి చెందిన రావాడ వెంకట్రావు, రామసుబ్బ దంపతులకు నలుగురు సంతానం. ముగ్గురు ఆడపిల్లలు, ఆఖరివాడు రావాడ ఆజాద్ చంద్రశేఖర్. వీరిది వ్యవసాయ కుటుంబం. ఆజాద్ చంద్రశేఖర్ ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు వీరవాసరంలోని పోతయ్య కాన్వెంట్‌లో చదివారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్లో, ఇంటర్మీడియట్ విజిటి జూనియర్ కళాశాలలో చదివారు. అగ్రికల్చర్ బిఎస్‌సి బాపట్ల కళాశాలలో, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో అగ్రికల్చర్ ఎంఎస్‌సి చేశారు. తరువాత పాడేరు నాబార్డ్ బ్యాంకులో పిఒగా మొట్టమొదట ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అయితే ఇంకా ఉన్నత స్థానాలు అధిరోహించాలనే లక్ష్యంతో పట్టుదలతో చదివి 1991లో ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు కేరళ రాష్ట్రంలో పాల్‌క్కాడ్‌కు ఎఎస్‌పిగా బాధ్యతలు చేపట్టారు. తరువాత ఉద్యోగోన్నతిపై త్రివేండ్రంలో డిఐజిగా పని చేశారు. కేరళలో పలు కీలక బాధ్యతల్లో సమర్థవంతంగా వ్యవహరించి రాష్ట్రపతి నుంచి ఉత్తమ సేవల అవార్డును అందుకున్నారు. అక్కడ నుంచి డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లారు. సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్ హోదాలో పని చేస్తున్న చంద్రశేఖర్‌ను ఇటీవలే సెంట్రల్ కేబినెట్ సెక్రటేరియట్ (స్పెషల్ సెక్యూరిటీ) కార్యదర్శిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఇంకా ఆ బాధ్యతల్లో చేరక ముందే కేరళ ప్రభుత్వం చంద్రశేఖర్‌ను డిజిపిగా ప్రకటించింది. కేరళ ప్రస్తుత డిజిపి షేక్ దర్వేష్ సాహెబ్ సోమవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం నూతన డిజిపిగా చంద్రశేఖర్‌ను నియమించింది. దీంతో వీరవాసరంలోని చంద్రశేఖర్ బంధుమిత్రులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. చంద్రశేఖర్‌కు భార్య సరిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రశేఖర్ వీరవాసరంలో తాను చదువుకున్న ఎంఆర్‌కె హైస్కూల్‌కు ఆర్థిక సాయం చేశారు. రామాలయ నిర్మాణానికి సుమారు రూ.10 లక్షలు అందజేశారు.



కుటుంబ సభ్యులతో ఆజాద్ చంద్రశేఖర్

వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

గోదావరి వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విపత్తు నియంత్రణ కార్యాచరణను పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై గోదావరి వరద నియంత్రణ, ఫ్లాష్ ఫ్లడ్, సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వరద సంసిద్ధత ప్రణాళిక కింద చేపట్టాల్సిన ముందస్తు చర్యలను గతానుభవాల నేపథ్యంలో అవసరమైన ప్రత్యేక చర్యలను వివరించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. వరదల సమయంలో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని మండలాల్లో వరద, భారీవర్షాల పరిస్థితులకు సంబంధించి అత్యవసర సందేశాలు పంపేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భద్రాచలంతోపాటు గోదావరి నదికి మరింత ఎగువ తెలంగాణాలోని ఆయా ప్రాంతాల్లో నమోదవుతున్న వరద సమాచారాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, తద్వారా వరద సహాయక చర్యలను మరింత ముందుగా చేపట్టేందుకు సమయం ఉంటుందని సూచించారు. కుక్కునూరు, వేలేరుపాడులో 101 నివాసిత ప్రాంతాల్లో మొదటి, రెండో, మూడో వరద ప్రమాద హెచ్చరికలకు అనుగుణంగా పునరావాస కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పునరావాస కార్యక్రమాలకు సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్, డిపిఒ, విద్యుత్, ఎంపిడిఒలతో కూడిన బృందం రిలీఫ్ కేంద్రాలను సంయుక్త తనిఖీ చేసి అక్కడ వసతి సౌకర్యాలను పరిశీలించి, స్థానికుల అవసరాలను తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తాత్కాలిక టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను సమకూర్చాలన్నారు. వైద్యులంతా హెడ్ క్వార్టర్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ, చికెన్‌గున్యా, డయేరియా, వైరల్ ఫీవర్ల నియంత్రణకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. తగినంత క్లోరిన్ ట్యాబ్లెట్లను సిద్ధం చేయాలన్నారు. ఫైర్ సర్వీసెస్ వరద ప్రభావిత ప్రాంతాలకు సమీపంలో అవసరమైన రక్షణ సామాగ్రిని సిద్ధం చేయాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ప్రజల తరలింపు, నిత్యావసర వస్తువులు, రవాణాకు అవసరమైన కండీషన్‌లో ఉన్న బస్సులను సిద్ధం చేయాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం విషయంలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిపిఒను కలెక్టర్ ఆదేశించారు. పునరావాస కార్యక్రమాలకు అవసరమైన బోట్లను సిద్ధంగా ఉంచాలని మత్స్యశాఖ జెడిని కలెక్టర్ ఆదేశించారు. వరద ప్రభావిత 10 మండలాల్లో వినియోగించేందుకు అవసరమైన డ్రోన్లను అందుబాటులో ఉంచి ట్రయల్ రన్ నిర్వహించాలన్నారు. ఏలూరు, నూజివీడులో వరద, వర్షాల మూలంగా సంభవించే పరిస్థితులను ఎదుర్కొనేందుకు మున్సిపల్ కమిషనర్, సబ్‌కలెక్టర్, ఆర్‌డిఒలు సమన్వయంతో పని చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో వినియోగానికి ముందస్తుగా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

గ్రామాల్లో బెల్ట్‌షాపులు తొలగించాలి

సిపిఎం ఆధ్వర్యాన మహిళల ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన బెల్ట్‌షాపులను వెంటనే తొలగించాలని సిపిఎం నాయకులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండలంలోని టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న నాలుగు బెల్ట్‌షాపులు తొలగించాలని మహిళలు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్ట్‌షాపు నిర్వాహకులను నిలదీశారు. వీరికి సిపిఎం నాయకులు గుడెల్లి వెంకట్రావు మద్దతు పలికారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గ్రామంలో మద్యం షాపులు నిర్వహించడం ద్వారా రోజంతా కష్టపడి తెచ్చిన డబ్బులు బెల్ట్‌షాపుల్లో పోస్తున్నారని, అర్ధరాత్రి అపరాత్రి లేకుండా బెల్ట్‌షాపుల్లో మందు తాగి పురుషులు రెక్కల కష్టమంతా వాటికే ధారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బెల్ట్‌షాపులు పెడితే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని పైకి చెబుతున్నా, అంతర్లీనంగా లైసెన్స్ ఇచ్చిన వారికి సహకరిస్తూ ఇష్టానుసారంగా బెల్ట్‌షాపులు పెట్టి ప్రజలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మండలంలో బెల్ట్ షాపులన్నీ తొలగించాలని, బెల్టుషాపులు పెట్టిస్తున్న ప్రధాన బ్రాందీషాపు యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




బెల్టుషాపుల వద్ద మహిళల ఆందోళన

75 శాతం హామీల అమలు కూటమి ఘనత

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాష్ట్రంలో 65 లక్షల మందికి ప్రతినెలా రూ.2712 కోట్లు ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద పలు రకాలైన పెన్షన్లు అందిస్తారని, ఏడాదిలో 75 శాతం హామీలను అమలు చేసిన ఏకైక ప్రభుత్వం కూటమిదేనని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మంగళవారం నాడు ఆగిరిపల్లి మండల పరిధిలోని చొప్పరమెట్లలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలంలో 9425 మంది పెన్షన్లదారులకు సంబంధించి రూ.4.12 కోట్లకుపైగా సొమ్ము పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. రానున్న కాలంలో చింతలపూడి ప్రాజెక్ట్‌ను పూర్తిచేసి నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇల్లు లేని ప్రతిఒక్కరికీ పక్కా ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. మండలంలో భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరిస్తామని, శోభనాచలస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో చొప్పరమెట్ల గ్రామ సర్పంచి కూరాకుల ఊర్మిళ, ఎంపిడిఒ బి.భార్గవి, టిడిపి మండలాధ్యక్షులు ఎన్.వేణు, మండల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పెన్షన్లు పంపిణీ చేస్తున్న మంత్రి

పెన్షన్ల సొమ్ము సద్వినియోగించుకోవాలి

పంపిణీని పరిశీలించిన జిల్లా ప్రత్యేకాధికారి ఆమ్రపాలి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తీరును జిల్లా ప్రత్యేక అధికారి, టూరిజం డైరెక్టర్ కె.ఆమ్రపాలి పరిశీలించారు. నగరంలోని పత్తేబాద్, ఎస్‌సి నివాసిత ప్రాంతంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని పలువురు లబ్ధిదారులకు సొమ్ము అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. వీరి వెంట డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, నగర మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెన్షన్ల పంపిణీ పరిశీలించిన ఆమ్రపాలి

9న సమ్మె జయప్రదం చేయాలి

కార్మిక సంఘాల సంయుక్త సమావేశం పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. మంగళవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు తదితర కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగినది. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుండి దేశంలో కార్మికులు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు దేశంలో కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారుల యజమానులకు అనుకూలంగా ఉన్నాయన్నారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ నూటికి నూరుశాతం ప్రయివేటీకరిస్తుందని విమర్శించారు. దేశంలో రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, వ్యవసాయ రంగాన్ని ఆదుకుని రైతుల ఆత్మహత్యలు అరికట్టాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో జిల్లాలోని యావత్తు ఉద్యోగ, కార్మికులు అంతా పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి నేత ఎ.అప్పలరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, నాయకులు కె.విజయలక్ష్మి, వైఎస్.కనకారావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరించిన నేతలు

ఇళ్ల స్థల పట్టాలివ్వకపోతే.. తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - మండవల్లి

పేదలకు ఇళ్ల స్థల పట్టాల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టాలు పంపిణీ చేసి స్థలాలు మెరక చేయాలని కోరుతూ తరుగుమూల ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నిర్వహిస్తున్న దీక్షకు ఆయన మద్దతు తెలిపి పేదలకు సిపిఎం అండగా ఉండి పోరాడుతుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేయడంలో తహశీల్దార్ తాత్సారం చేయడం తగదన్నారు. లబ్ధిదారులు తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తుంటే పట్టించుకోకుండా రెవెన్యూ శాఖ దున్నపోతు మీద వర్షం కురిసిన చందంగా వ్యవహరించడం సరికాదన్నారు. పట్టాలైనా ఇవ్వండి.. మెరకైనా చేయండి అంటూ 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్న పట్టించుకోకుండా ఇప్పుడు పట్టాల వెరిఫికేషన్ చేస్తానని మాట్లాడటం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. 20 ఏళ్ల క్రితం ఇచ్చిన పట్టాలను ఇప్పుడు ఎలా వెరిఫికేషన్ చేస్తారని నిలదీశారు. పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్‌కు స్థలం క్షణాల్లో కేటాయించి, గంటల్లో పూడ్పించిన అధికారులు పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి రెండు నెలలు పడుతుందని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కూటమి నాయకులు లబ్ధిదారుల మధ్య చీలిక తీసుకొచ్చి పోరాటాన్ని నిర్వీర్యం చేయాలని చూసినా పట్టాలు పంపిణీ చేసేంత వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోలీస్ స్టేషన్‌తో నిమిత్తం లేకుండా పట్టాలను రెండు రోజుల్లో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ సింహాచలం, సూర్యం, రాజ్యలక్ష్మి, పద్మ, సోవమ్మ, నాగమణి, వెంకటేశ్వరమ్మ, చింతామణి దుర్గ, లక్ష్మీ, కొండపల్లి కుమారి, చిగురుపాటి మరియమ్మ, కొండపల్లి కమల, మేడేపల్లి సుజాత, వర్రీ ఎర్ర బుజ్జి, గండేపూడి జయంత, కారి సువర్ణ, రొందుల రూతమ్మ, కళ్యాణపు రాహుల్, కోటే మరియమ్మ, పండు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నినదిస్తున్న పేదలు, నేతలు

ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో తరలొచ్చిన ప్రజల నుంచి ఎంపీ అర్జీలు స్వీకరించారు. పలువురు వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను ఎంపీ సావధానంగా విని, కొన్నింటికి అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించారు. గ్రామాల్లో నెలకొన్న సామాజిక సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధుల మంజూరుకు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల అర్జీలు పరిష్కరించాక, వాటిపై నివేదికలను తనకు సమర్పించాలని ఎంపీ ఆదేశించారు. అనంతరం ఎంపీ మహేష్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాలకు పైపులైన్లలోకి మురుగు చేరి కలుషితమయ్యే అవకాశం ఉన్నందున తాగునీటిని క్లోరినేషన్ చేసి ప్రజలకు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.



వినతులు స్వీకరిస్తున్న ఎంపీ

పామాయిల్ ఫ్యాక్టరీని ప్రయివేటీకరించొద్దు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెదవేగి పామాయిల్ పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటీకరించే ఆలోచనను విరమించుకోవాలని, ఫ్యాక్టరీపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను, రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1992లో ప్రభుత్వరంగంలో ఏర్పాటు చేసిన పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం నష్టాలు వస్తున్నాయనే సాకుతో ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసిందని, దీనిని సిపిఎంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ పరిశ్రమపై 300 మంది కార్మికులు, 33 వేల ఎకరాల్లో ఉన్న 1100 మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా పరిశ్రమను ఆధునికీకరించి ముందుకు తీసుకెళ్లాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయకుండా ఇప్పుడు ప్రయివేటు వ్యక్తుల లాభాల కోసం కార్మికులు, రైతుల జీవితాలను నాశనం చేసే ప్రయివేటీకరణ చర్యలు చేపట్టడం తగదని తెలిపారు. ప్రయివేట్ వ్యక్తుల లాభాల కోసం ప్రభుత్వరంగ సంస్థలను మొత్తంగా ప్రయివేటీకరించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలో భాగంగానే మోడీ, చంద్రబాబు పెదవేగి పామాయిల్ పరిశ్రమను ప్రయివేటీకరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ క్రమంలోనే విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు ప్రయత్నాలు చేసినా అక్కడి కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారని, అదే పద్ధతిలో పెదవేగి పామాయిల్ పరిశ్రమను ప్రయివేటీకరిస్తే కార్మికులు, రైతులు, ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రజల సంస్థగా ఉండే ప్రభుత్వరంగ సంస్థలను కొంతమంది జేబుసంస్థలుగా మార్చే ప్రయివేటీకరణ ఆలోచనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పండుతున్న మొత్తం పామాయిల్‌లో సగభాగం ఏలూరు జిల్లాలోనే రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఏడెనిమిది ప్రయివేటు పరిశ్రమలున్నా అవి సరైన గిట్టుబాటు ధర రైతులకు ఇవ్వక ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, ఈ ప్రభుత్వ పరిశ్రమ మాత్రమే రైతులను ఆదుకుంటుందని, ఇలాంటి ఈ పరిశ్రమను కూడా ప్రయివేటీకరించి రైతులను నష్టపరిచే చర్యలు ప్రభుత్వం చేపట్టడం సరైన పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. గతంలో విదేశీ ఆయిల్ దిగుమతిపై 50 శాతం సుంకం ఉండేదని, ట్రంప్‌కు తలొగ్గి దానిని 16 శాతానికి తగ్గించడం వల్ల మన దేశ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిమంది లాభాల కోసం పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని ప్రయివేటీకరిస్తే కార్మికులు, రైతులు ప్రతిఘటించేందుకు సిద్ధంగా ఉన్నారని, వారికి సిపిఎం అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టులో ఈ నెల ఐదో తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కోరారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఫ్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు.

పచ్చిరొట్ట సాగుతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి - చింతలపూడి

పచ్చిరొట్ట సాగుతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని, భూమికి జీవమని ప్రకృతి వ్యవసాయ మండల కమ్యూనికేషన్ డిజిటల్ ఫెసిలిటేటర్ మరికంటి గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని ఎండపల్లిలో రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పిఎండిఎస్ విధానంలో నవధాన్యాల పచ్చిరొట్ట సాగు విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి బి.నరసింహ, ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది, మహిళా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

పిజి సెట్ పరీక్షల్లో కంప్యూటర్ సైన్స్, లైఫ్ సైన్స్, కెమికల్ సైన్స్ విభాగాల్లో చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించడం హర్షణీయమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల విద్యార్థిని ధాత్రి నాగలక్ష్మి కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులో 143వ ర్యాంకును సాధించిందని చెప్పారు. ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం ధాత్రి నాగలక్ష్మితో పాటు వివిధ విభాగాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

సురక్షిత ప్రాంతానికి బాలసదనం

స్త్రీ, శిశుసంక్షేమ శాఖ పీడి శారద

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని కుమ్మరిపేటలో ఉన్న బాలసదనాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించనున్నట్లు స్త్రీ, శిశుసంక్షేమ శాఖ పీడీ శారద తెలిపారు. బాలసదనాన్ని ఆమెతో పాటు అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పీడీ శారద మాట్లాడుతూ ప్రస్తుతం బాలసదనం కొనసాగుతున్న ప్రదేశంలో పైకప్పు మరమ్మతుల దృష్ట్యా రానున్న పది రోజుల్లో వేరొక సురక్షిత ప్రాంతానికి తరలించనున్నట్లు చెప్పారు. జిల్లా పరిధిలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల స్థానంలో సొంత భవనాల నిర్మాణాల కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. అతి త్వరలో అద్దె భవనాల్లోని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ పిల్లి విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల అమలులో అవినీతిని ఉపేక్షించం

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

ప్రభుత్వ పథకాల అమలులో ఎక్కడైనా ఎవరైనా నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించబోమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం పినకడిమి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు అందుకుంటున్న లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి వారికి పెన్షన్లు అందించారు. రోడ్లు, డ్రెయిన్ల పరిస్థితులను పరిశీలించి వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

నూతన వంగడాలను సాగు చేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కాలాతీతమైన విత్తనాలను వదిలిపెట్టి నూతన వంగడాలను రైతులు సాగు చేయాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఫణికుమార్ అన్నారు. మండలంలోని కొరగుంటపాలెం, పెదగొన్నూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. మండవల్లి ఎడిఎ జి.వెంకటమణి, ఎఒ వేణుమాధవ్ మాట్లాడారు. అనంతరం రైతులకు శాస్త్రవేత్తలు మినీ కిట్స్ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇరు గ్రామాల రైతులు, సర్పంచులు పేరే రామకృష్ణ, తాడంకి శిరీష, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ముసునూరు : వరి నారును బీజ అమృతంతో శుద్ధిచేసి నాటితే కాండం తొలిచే పురుగు ఆశించదని మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి అన్నారు. మండలంలోని ముసునూరు, కొర్లకుంట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారు మడి దశలో రైతులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పకృతి వ్యవసాయం చేయాలని, కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలని చెప్పారు.

విఆర్‌ఒలకు సన్మానం

ముదినేపల్లి :మండలంలో అత్యధిక నీటి తీరువా వసూలు చేసిన పలువురు విఆర్‌ఒలను తహశీల్దార్ షేక్ లతీఫ్ భాషా సన్మానించారు. వైవాక, చేవూరు గ్రామాల విఆర్‌ఒలు నాగరాజు, వెంకటసుబ్బయ్యలకు పూలమాలవేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పవన్‌కుమార్, ఆర్ఐ రాజశేఖర్, రీ సర్వే డిటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఎంఎల్ఎను బెదిరించిన కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజును బెదిరించిన కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ విధించినట్లు పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... తనపై అసత్య ఆరోపణలు చేస్తూ ఓ ఆంగ్ల పత్రికలో ప్రచురించి వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పేపర్ విలేకరి అయిన పాదం మూర్తినాయుడు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరు పరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

వివాహితపై అత్యాచారయత్నం

ప్రజాశక్తి - ముదినేపల్లి

వివాహితపై ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని పేరూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వివాహిత మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన దేవరకొండ సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఆమె జుట్టు పట్టుకుని అత్యాచారయత్నానికి పాల్పడగా మహిళ తప్పించుకుని కేకలు వేయగా చుట్టుపక్కల వారు రావడంతో సత్యనారాయణ అక్కడి నుంచి పరారయ్యాడు. వెళ్తూ వెళ్తూ తనను చంపేస్తానని బెదిరించాడని వివాహిత తెలిపింది. ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు వారు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భార్యాభర్తల మధ్య వివాదం..

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

భార్యాభర్తల మధ్య వివాదం నేపథ్యంలో మనస్తాపానికి గురైన భర్త పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... అయ్యప్ప రాజుగూడేనికి చెందిన పి.హానక్‌కు మద్యానికి బానిసై ఏ పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య పది రోజులుగా వివాదం ఏర్పడింది. దీంతో మనస్తాపానికి గురైన హానక్ మంగళవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు అతడిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

కుక్కునూరు :మండలంలోని కిన్నెరసాని వాగు ఒడ్డున నాటు సారా స్థావరంపై కుక్కునూరు సిఐ ఎం.రమేష్‌బాబు నేతృత్వంలో మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

9న దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు

ఏజెన్సీ, మెట్టప్రాంత భూ సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం


మాట్లాడుతున్న బి.బలరాం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం తెలిపారు. ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లోని భూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగమణి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన జరిగే సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా నాలుగు కోడ్‌లుగా మార్చడం పెట్టుబడిదారుల సేవ కోసమేనని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు పని గంటల పెంపు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమేనన్నారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటు పరం చేస్తూ, కార్మిక హక్కులను కాలరాస్తూ ధరలు, నిరుద్యోగం పెంచుతున్న మోడీ ప్రజలను పక్కదోవ పట్టించేందుకు మతాన్ని రాజకీయాల్లోకి లాగుతున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఎల్‌టిఆర్ భూములు గిరిజనుల సాగులో ఉన్నప్పటికీ అడంగల్‌లో పేర్లు నమోదు చేయడం లేదన్నారు. ఎల్‌టిఆర్ భూములు పోలవరం నిర్వాసితులకు కొనుగోలు చేయడానికి చట్టవిరుద్ధమని తెలిసినా గిరిజనేతర భూస్వాముల పేర్లతో రికార్డులు మార్పు చేసి కొందరు అధికారులు, అప్పటి అధికారపార్టీ నాయకులు కుమ్మక్కై దాదాపు రూ.500 కోట్ల కుంభకోణంతో ఆర్అండ్ఆర్ భూముల కొనుగోలు సాగించారన్నారు. అప్పుడే అదనంగా ఒక వెయ్యి ఎకరాలు సేకరించామని చెప్పిన అధికారులు ఇప్పుడు మరోసారి భూసేకరణ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో ఎల్‌టిఆర్ భూములు కొనుగోలు చేయకూడదనే నిబంధనను తప్పక పాటించాలన్నారు. వందలఏళ్లుగా నివాసం ఉంటూ పోడు భూములు సాగుచేస్తున్న గిరిజనులకు గ్రామసభలు నిర్వహించి హక్కుపత్రాలు ఇవ్వాలని కోరారు. ఏజెన్సీ బయట జంగారెడ్డిగూడెంలో, టి.నర్సాపురంలో ఎర్రకాలువ మిగులు భూములు అక్కడ పేదలకు ఏక్ సాల్ పట్టాలు ఇచ్చి సాగుకు అనుమతించాలని గౌరవ హైకోర్టు తీర్పు ఇచ్చినా ఇప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తమ వైఖరి మార్చుకోవాలని, గిరిజనులు, పేదల పక్షంగా నిలబడి భూ సమస్యను చట్ట ప్రకారం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎం.జీవరత్నం, ధర్ముల రమేష్, వై.నాగేంద్రరావు, ఎ.ఫ్రాన్సిస్, జి.నరసింహారావు, ఎస్.మహంకాళి, కె.భాస్కర్, తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, మడకం సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - మండవల్లి

కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని సింగనపూడి, మండవల్లి గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక, రైతాంగ హక్కుల కోసం జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కర్రా జగదీష్, పక్కిరి జేమ్స్, బొడ్డు చింతయ్య, పౌలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం :నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన అంగన్వాడీ మూడు సెక్టార్ల సమావేశంలో వారు మాట్లాడారు. పది గంటల పనిదినం, లేబర్ కోడ్‌ల రద్దు కోసం సమ్మెను జయప్రదం చేయాలని అంగన్వాడీ సిబ్బందిని కోరారు. బయ్యన్నగూడెం, పొంగుటూరు, కొయ్యలగూడెం సెక్టార్ కమిటీలను ఎన్నుకున్నారు.

కలిదిండి : ఈ నెల తొమ్మిదో తేదీన కార్మిక సంఘాలు చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్ కోరారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ సమ్మెలో కార్మికులందరూ ఏకమై పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలాజీ, పరసా రాజేష్, అక్బర్, కె.శ్రీను, బి.సూరిబాబు, రమేష్, నారాయణ మూర్తి పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం


ఉంగుటూరులో...

ప్రజాశక్తి - ఉంగుటూరు

డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం పలువురు ప్రభుత్వ వైద్యులను సత్కరించారు. కాగుపాడు పిహెచ్‌సి వైద్యులు పి.మానస, ఇ.అనూషలను ఆసుపత్రి వైద్యేతర సిబ్బంది, గ్రామస్తులు సన్మానించి కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఎంపిహెచ్ఎ కె.శ్రీనివాసరావు, పిహెచ్ఎన్.నాగమణి, స్టాఫ్ నర్సులు ప్రశాంతి, దేనా, ఇ.నర్సమ్మ, ఎంపిహెచ్ఎస్.సత్యనారాయణ, ఎంపిహెచ్ఎ గణపతి, గ్రామస్తులు పాల్గొన్నారు. ఉంగుటూరు మండల పిఎంపిలు కాగుపాడు పిహెచ్‌సి వైద్యులతో పాటు చేబ్రోలు ఆసుపత్రి వైద్యులు శ్రావణ్‌రెడ్డి, భూషణరావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ది కమ్యూనిటీ పారామెడికల్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు కాళి మంగన్న, జాయింట్ సెక్రటరీ ఎర్రమోతు సురేష్‌బాబు, ఇసి మెంబర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి :జాతీయ వైద్యుల దినోత్సవం వేడుకలు మంగళవారం ముదినేపల్లిలో నిర్వహించారు. స్థానిక విజయ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ముదినేపల్లిలోని ప్రభుత్వ, ప్రయివేట్ హాస్పటల్స్‌లో రేయింబవళ్లు నిర్విరామంగా ప్రజలకు సేవలందిస్తున్న ప్రముఖ వైద్యులకు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా విజయఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ వినయ్‌కుమార్ మాట్లాడారు. ప్రిన్సిపల్‌తో పాటు డైరెక్టర్ తనుజ వైద్యులకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ముదినేపల్లి, గురజ, దేవపూడి పిహెచ్‌సిల్లో డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి జాస్తి జగన్మోహనరావును పిహెచ్‌సి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిబ్బంది పూలబోకేలు అందించి, కేక్ కట్ చేయించారు.

ఏలూరు సిటీ :డాక్టర్స్ డే సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్, లయన్స్ జిల్లా నాయకులు అమర శ్రీ, ఇందిరా దేవి దంపతులు ఏలూరులో ఉన్న ప్రముఖ జనరల్ సర్జన్లు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఎం.శర్వాణి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.ప్రసన్నకుమార్, ప్రముఖ జనరల్ మెడిసిన్ వైద్యులు స్వరూప్ రెడ్డి, ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు పి.విజయభాస్కర్‌రెడ్డి, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ భరద్వాజులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. శాలువా పూలదండలు సమర్పించి సత్కరించారు.


ముసునూరులో...

జంగారెడ్డిగూడెం :మానవసేవే మాధవ సేవ అని ఇన్నర్ వీల్ క్లబ్ జంగారెడ్డిగూడెం గోల్డ్ అధ్యక్షురాలు నాగసూరి మాధురి అన్నారు. డాక్టర్స్ డే, చార్టర్ అకౌంటెంట్స్ డే సందర్భంగా పట్టణం మొట్టమొదటి చార్టర్ అకౌంటెంట్ బండారు సత్యనారాయణ, మరో చార్టర్ అకౌంటెంట్ దాకావరపు కృష్ణ, సాయి దుర్గా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు భోగేశ్వరరావు, దొండమూడి పిల్లల హాస్పిటల్ వైద్యులు రామ్‌ప్రసాద్, డెంటల్ క్లినిక్ వైద్యులు చామర్తి శివరాం, జెమిని హాస్పిటల్ వైద్యులు స్వాతిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఇన్నర్ వీల్ క్లబ్ జంగారెడ్డిగూడెం గోల్డ్ కోశాధికారి ఆదిలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. గోకుల పారిజాత గిరి ఆలయం గిరి ప్రదక్షిణ రహదారికి అటు ఇటు మామిడి మొక్కలు నాటారు. జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 50 మంది వైద్యులను సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ వైద్యుల సేవలు ఎనలేనివన్నారు. జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శేషుకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.


ముదినేపల్లిలో...

ముసునూరు : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు షకీనా ఇవాంజిలిన్‌ను ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ నిత్యం గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలందిస్తున్నామన్నారు.

చింతలపూడి : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. నాగదేశి తెరేజమ్మ సన్మాన పత్రం, మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత చింతలపూడి శాఖ గౌరవ డైరెక్టర్ అన్నవరపు సత్యనారాయణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోండ్రు దేవా, ఛైర్మన్ ఆర్నేపల్లి అప్పారావు, కన్వీనర్ కాండ్రేగుల నాగ చిన్నారావు, అధ్యక్షులు యడ్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి మన్యం సత్యకుమార్, కోశాధికారి జల్లిపల్లి విశ్వేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగుడికి నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి అంబేద్కర్ కాలనీకి చెందిన వికలాంగుడికి మేము సైతం టీమ్ ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. బొజ్జ సుందరరావుకు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ నడవలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న మేము సైతం టీమ్ సుందరరావు కుటుంబాన్ని పరామర్శించి కొంత నగదు సహాయంతో పాటు రైస్ బ్యాగ్, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. మొవ్వ ఫణీంద్ర పుట్టినరోజు సందర్భంగా సాయం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నిమ్మగడ్డ బిక్షాలు, దాకరం గ్రామ సర్పంచి జాస్తి రాఘవేంద్రరావు, మేము సైతం టీమ్ భూపతి రవీంద్ర, సందీప్ కుమార్, ఇస్రాయెల్ రాజు, పి.విజయసాగర్, నందీశ్వరరావు బి.విజయసాగర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన ఇళ్ల స్థలాలను చూపాలని నిరసన

కలిదిండి :ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూమి అన్యాక్రాంతమవుతున్నందున తమ ఇంటి స్థలాలను తమకు అప్పగించాలని కోరుతూ లబ్ధిదారులు పాకలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత నాలుగేళ్ల క్రితం మండలంలోని సానా రుద్రవరం గ్రామంలో అర్హులైన 72 మందికి సుమారు రెండు ఎకరాల్లో లే అవుట్లు వేసి ఇంటి పట్టాలు ఇచ్చారన్నారు. ఓ భూస్వామి ఆ స్థలంలోకి రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. స్థలాల్లోని సరిహద్దు రాళ్లు సైతం పూర్తిగా తొలగించి భూమిని దున్నేశారన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు కేటాయించిన స్థలాలను అప్పగించి గృహ నిర్మాణాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన్నే రమేష్, తలకటూరి జగన్, రాఘవులు, మోటుపల్లి రమేష్, కండవల్లి మంగయ్య, కొంగల లక్ష్మి, కుంపటి సుమలత, జంగాల మరియమ్మ, మాగిని లక్ష్మి పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభుత్వం సుపరిపాలనే ధ్యేయంగా ముందుకెళ్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని 20వ డివిజన్‌లో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ బడేటి చంటి, ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడుతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు.

జీలుగుమిల్లి :మండలంలోని బర్రింకలపాడులో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. మండలవ్యాప్తంగా 4,212 పెన్షన్లకు 3,833 పింఛన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు.

ముసునూరు :వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఒకటో తేదీనే పెన్షన్లు అందిస్తున్నట్లు టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు మందలపు ధర్మరాజు అన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో కొల్లి గంగారం, మెదరమెట్ల సురేంద్ర, గరిక ముక్కు నాని, ఉప్పలపాటి గణేష్, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల ప్రతాప్, సూర్యదేవర శ్రీనివాసరావు, పులి బళ్ల సత్యనారాయణ, గద్దల మోహనరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన : మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజానీకానికి సుపరిపాలన అందిస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఈ నెల రెండో తేదీ నుంచి కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సుపరిపాలనలో - తొలి అడుగు కార్యక్రమంపై పట్టణంలోని రోటరీ కల్యాణ మండపంలో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుపరిపాలనలో - తొలి అడుగు కార్యక్రమంలో ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఏలూరు సిటీ :కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంపై ఏలూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం అవగాహనా కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో బుధవారం నుంచి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

CHANGE OF NAME

I, **EDDEM SRAVANA SANDHYA** W/o. Eddem Kishore Kumar, D.No.16-4-35/7, MIG 34, HB Colony, Near YSR Colony, Narasapuram-534275, W.G.Dt. After marriage I have changed my name from **BALLA SRAVANA SANDHYA KUMARI** (Old name) to **EDDEM SRAVANA SANDHYA** (New name) hence forth I am being called **EDDEM SRAVANA SANDHYA** W/o. Eddem Kishore Kumar, for all purposes.

ప్రకటన

నా క్లయింటు పెదవేగి గ్రామ కాపురస్తులు కన్నూరి జాన్ పీటర్ గారికి ఏలూరు నగరం, చొదిమెళ్ళ గ్రామంలో ఆర్.ఎస్.నెం. 283 రులో చ.గ.96.0.0 లు స్థలము అందులోని రేకుల ఇల్లు గల ఆస్తి క్రయ దస్తావేజు నెం. 4514/2022, తేది. 30-03-2022 తాడేపల్లిగూడెం ఎస్.ఆర్.ఓ ద్వారా సంక్రమించినది. సదరు ఒరిజినల్ దస్తావేజు మరియు ఇతర పత్రములను కవర్‌లో పెట్టుకుని కాత్రేనిపాడు నుండి ముసునూరు వెళ్ళుచుండగా, మార్గమధ్యలో పడిపోయినవి. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ పేపరు ప్రకటన ఇచ్చిన 7 రోజులలోగా ఈ దిగువ తెలిపిన అడ్రస్సుకు గానీ, నాకు గానీ, నా క్లయింటుకు ఇవ్వగలరు.

కె.వి.పి. మాధవరావు
అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు
అడ్వకేట్ నోటరీ, ఏలూరు
సెల్ నెం: 94401 11033

MUNICIPAL CORPORATION, ELURU

e-Procurement Tender Notice No:81-84/General & 15th FC/2025-26, Dt:28-06-2025

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible Bidders for **"Providing Borewell, Transformer at raw water pump house, Supply & Delivery of Chain Mounted Ex70 Excavator and Desilting of Drain at various palaces in Municipal Corporation, Eluru"** Total No of works is 4 with an amount of Rs. **92.67** Lakhs

Tender schedules are available on e-procurement market place from 02-07-2025. Last date of receipt of tenders is 07-07-2025. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU

In The Court of The Mact -Cum -V Addl District Judge W.G.Dt, Eluru

M.V.O.P.No. 386/2024

Between:

పెనుమత్స వేద కుమారి & 2 అదర్స్ ...పిటిషనర్

&

నాయుడు హరిగోపాల్ & 2 అదర్స్ ...రెస్పాండెంట్స్

పై నెంబరు గ్రంథంలో
R1 నాయుడు హరి గోపాల్, S/o. శ్రీరాములు, R/o. 18/224-6, ఇంగ్లీషుపాలెం, మచిలీపట్నం, కృష్ణాజిల్లా అను వారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 09-07-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె. నాగేశ్వరరావు
ఏలూరు అడ్వకేట్, ఏలూరు
తేది:01-07-2025 సెల్: 94411 50114

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ Vవ, అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్ట్ ఏలూరు జిల్లా, ఏలూరు.,

ఎం.వి.ఓ.పి.నెం. 59/2025

బిట్వీన్:-
మురాల లక్ష్మి నారాయణ ...పిటీషనర్
మరియు
వీర వెంకట శ్రీనివాసరావు ...రెస్పాండెంట్స్

STEPS PETITION FILED BEHALF OF THE PETITIONER UNDER ORDER -5 RULE 20 OF C.P.C

టూ: 3వ రెస్పాండెంట్ :

శ్రీ డివిజనల్ మేనేజర్, చోళ్ళ ఎం.ఎస్. జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ కో.లి., ప్లాట్ నెం. 401, రాజా రామమోహనరావు వీధి, పవర్ పేట, ఏలూరు, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

అడ్రస్సు : ప్లాట్ నెం. 401, రాజా రామమోహనరావు వీధి, పవర్ పేట, ఏలూరు, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు గ్రంథములో మీరు 3వ రెస్పాండెంట్స్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్ట్ ద్వారా మీకు సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్ట్ వారి ఉత్తర్వుల ప్రకారము పత్రిక ముఖముగా తెలియజేయునది ఏమనగా, **ది. 09-07-2025 వ తేదిన** పై నెంబరు గ్రంథములో శ్రీ కోర్టు వారి ఎదుట మీ హాజరు నిమిత్తము వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయముగా గాని, లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల సదరు పై నెంబరు గ్రంథములో మీ యొక్క పరోక్షముగా విచారించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బద్ది వరహాలరావు
బద్ది శిరీష
ఏలూరు
తేది:01-06-2025 న్యాయవాదులు, ఏలూరు
సెల్: 94406 53935, 90599 11539

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), భీమవరం వారి కోర్టులో

I.A.No.402/2022 in O.S.No.163/2022

పిటిషనర్ /వాది: కేసిబోయిన వెంకట సత్యనారాయణ

రెస్పాండెంట్స్/ప్రతివాదులు:

1. పెన్మెత్స రుక్మిణి దేవి, భర్త లేట్ వెంకట సత్య సన్యాసి బాబా రవి కుమార్ వర్మ, డోర్ నెం.2-115, ఓదూరు గ్రామం, పెనుమంట్ర మండలం, ప.గో.జిల్లా.
2. పెన్మెత్స వెంకట రామరాజు వర్మ, తండ్రి లేట్ వెంకట సత్య సన్యాసి బాబా రవి కుమార్ వర్మ, డోర్నెం.2-115, ఓదూరు గ్రామం, పెనుమంట్ర మండలం, ప.గో.జిల్లా.
3. కలిదిండి శ్రీ సూర్య సావిత్రి సుభద్రాదేవి, భర్త రామ సత్య సునీల్, తండ్రి లేట్ వెంకట సత్య సన్యాసి బాబా రవి కుమార్ వర్మ, డోర్నెం.2-115, ఓదూరు గ్రామం, పెనుమంట్ర మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు గ్రంథంలో 1 నుండి 3 రెస్పాండెంట్స్/ప్రతివాదులకు శ్రీయుత కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది.18-07-2025 తేదీకి వాయిదా అయివున్నది. కావున ప్రతివాదులు అయిన మీరు **ది.18-07-2025 ఉదయం 10.30 ని॥లకు** మీ అభ్యంతరములను స్వయముగా గాని, మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేనియెడల సదరు పై నెంబరు గ్రంథములో పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

భీమవరం **యు.వరప్రసాద్**
తేది.30-6-2025 వాది తరపు అడ్వకేట్.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), భీమవరం వారి కోర్టులో

O.S.No.163/2022

వాది: కేసిబోయిన వెంకట సత్యనారాయణ

ప్రతివాదులు:

1. పెన్మెత్స రుక్మిణి దేవి, భర్త లేట్ వెంకట సత్య సన్యాసి బాబా రవి కుమార్ వర్మ, డోర్ నెం.2-115, ఓదూరు గ్రామం, పెనుమంట్ర మండలం, ప.గో.జిల్లా.
2. పెన్మెత్స వెంకట రామరాజు వర్మ, తండ్రి లేట్ వెంకట సత్య సన్యాసి బాబా రవి కుమార్ వర్మ, డోర్నెం.2-115, ఓదూరు గ్రామం, పెనుమంట్ర మండలం, ప.గో.జిల్లా.
3. కలిదిండి శ్రీ సూర్య సావిత్రి సుభద్రాదేవి, భర్త రామ సత్య సునీల్, తండ్రి లేట్ వెంకట సత్య సన్యాసి బాబా రవి కుమార్ వర్మ, డోర్నెం.2-115, ఓదూరు గ్రామం, పెనుమంట్ర మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు గ్రంథంలో 1 నుండి 3 ప్రతివాదులకు శ్రీయుత కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది.18-07-2025 తేదీకి వాయిదా అయివున్నది. కావున ప్రతివాదులు అయిన మీరు **ది.18-07-2025 ఉదయం 10.30 ని॥లకు** మీ అభ్యంతరములను స్వయముగా గాని, మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేనియెడల పై నెంబరు గ్రంథములో మీ పరోక్షమున తీర్మానించబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

భీమవరం **యు.వరప్రసాద్**
తేది.30-6-2025 వాది తరపు అడ్వకేట్.